# స్వేచ్ఛ

మనం ఎక్కడికి వెళ్ళి - ఎక్కడ తిరిగినా - చివరకి మన 'గూటికే' రావాలనుకుంటాం! మన ఇల్లంటే మనకి అంత ప్రత్యేకాభిమానం ఉంటుంది ! అంతకు మించి... మన ఇంట్లో మనకి 'స్వేచ్ఛ' ఉంటుంది!

ఇంట్లో రాత్రి ఒంటిగంట దాకా మెలుకువగా ఉండి -పోచికోలు కబుర్లు చెప్పుకున్నా...

ఆ మర్నాడు మధ్యాహ్నంలేచి ముఖం కడుక్కొని మళ్ళీ పడుకున్నా...

క్రితం నిముషం కాఫీ తాగి, మరునిముషం ఐస్‌క్రీం తిన్నా...

రోజుకి లక్షా తొంభైసార్లు అలిగినా...

తిక్కపుట్టి అటకెక్కి కథాకళి చేసి, గయ్ గయ్‌న అందర్నీ కసిరినా... ఇంకేం చేసినా... చెల్లిపోతుంది! ఎవరూ ఏ 'ఎనిమిదో వింత'లా చూడరు !

కానీ కొందరు దురదృష్టవంతులకి... ఇంట్లో నవ్వడానికి వీలుండదు ! సరదాగా కబుర్లు చెప్పుకోవడానికీ చోటుండదు ! కనీసం... మనసారా ఏడ్చుకోవడానికీ స్వేచ్ఛ ఉండదు.

తినడానికి, నవ్వడానికీ, ఏడ్వడానికీ, మాట్లాడ టానిక్కూడా స్వేచ్ఛలేని మనుషులకు... తమదేశ 'స్వాతంత్ర్య జెండా'ల రెపరెపల్లో... బానిస సంకెళ్ళే కన్పిస్తాయి ! సొంతిల్లు కూడా పరాయి ఇల్లే అన్పిస్తుంది!

కొందరు భర్తలు భార్యలకి ఉద్యోగం చేసే స్వేచ్ఛని ఎంతో ఉదారంగా ప్రసాదిస్తారు! అదే సమయంలో... సంపాదించిన దాంట్లో పదో వంతైనా ఖర్చు పెట్టుకోవాలనుకునే స్వేచ్ఛని మాత్రం నిర్దాక్షిణ్యంగా హరిస్తారు.

ఇక్కడ భర్తలకి... భార్యలు బంగారు గుడ్లుపెట్టే బాతులు ! అంతే తప్ప... ఆ భార్యలకో మనసుంటుందనీ... అది అనుక్షణం స్వేచ్ఛ కోసం పరితపిస్తుందనీ... కట్టడిచేస్తే ఏదో జీవచ్ఛవంలా కాపురం చేస్తారే తప్ప.... తమ మెత్తని ప్రేమని మనస్ఫూర్తిగా పంచివ్వలేరనీ... గ్రహించరు!

ఇకపోతే.... టీనేజ్‌లో అడుగెట్టిన పిల్లలందరూ అప్పుడే గుడ్డులోంచి బయటకి వచ్చిన కోడిపిల్లలకి మల్లే - మళ్ళీ మళ్ళీ చూడాలనిపించేలా.... ముద్దుగా..., బొద్దుగా ఉంటారు.

ఇంతలేసి కళ్ళతో ప్రపంచాన్ని వింతగా చూస్తూ తల్లి రెక్కల కింద నుండి బయట ప్రపంచంలో అడుగిడిన కోడిపిల్లలకి - లోకమంతా పచ్చగా, అందంగా, హాయిగా, అపురూపంగా కన్పిస్తుంది.

తల్లికి దూరంగా బితుకు బితుకుమంటూ ఒక్కొక్క అడుగే...... ముందుకేసే కోడిపిల్ల- ఏమాత్రం అలికిడైనా.... పరుగు పరుగున మళ్ళీ తల్లి రెక్కల కిందకి పరుగెత్తుకు వస్తుంది. తనమీద తనకి నమ్మకం పెరిగే కొద్దీ, బిడ్డ...తల్లి 'వాత్సల్యం' పరిధిని దాటి ఇంకా ముందుకు వెళ్ళడానికి ప్రయత్నిస్తూ ఉంటుంది !

అనుక్షణం తన కంటికి రెప్పల్లే కాపాడుకోవాలనుకునే తల్లి ప్రవర్తన... పిల్లలకి చిరాగ్గా ఉంటుంది!

'తమ మీదా, తమ వ్యక్తిత్వమ్మీదా ఆ మాత్రం నమ్మకం లేదా ? తమ మీద



Contd...

ఎందుకింత ఓవర్ ప్రొటెక్షన్ ?" అని గింజుకునే ఆడ పిల్లలు పరిసరాల స్పృహలేక... నిర్లక్ష్యంగా ముందుకు దూసుకెళ్తే... టక్కున ఏ దుష్టుడో.... ఎక్కడ ఏ గద్ద రూపంలో తన్నుకుపోతాడో అని గిజగిజలాడి పోతారు... కన్నవాళ్ళు.

కన్నవాళ్ల వాత్సల్యానికీ, పిల్లల వ్యక్తిత్వానికీ మధ్య ఘర్షణ ఏర్పడినపుడు పిల్లల మనస్సు విరిగి - వద్దన్నదే చేయాలనే 'కసి' పెరుగుతుంది! పిల్లల తిరుగుబాటుకీ, తిరస్కారానికీ పెద్దవాళ్ళ గుండెలు అవిసిపోతాయి - ఇద్దరి మధ్యా 'సంయమనం' ఒక్కటే సయోధ్య కల్గిస్తుంది!

స్వేచ్ఛలేని చోట -

'ప్రేమ' అంతర్థానమవుతుంది.

'భయం' ప్రత్యక్షమవుతుంది.

'విప్లవం' రాజుకుంటుంది.

'తెగింపు' అనివార్యమవుతుంది.

**స్వేచ్ఛని మించిన 'వరం' మనిషికి మరోటి లేదు.**

అందుకే.... దేశాలూ, మనుషులేకాదు - మనసులుకూడా స్వేచ్ఛకోసమే ఆరాట పడతాయి - పోరాడుతాయి - తపస్సు చేస్తాయి!

ఆ వరాన్ని ప్రసాదించే చేతులు మాత్రమే.....

-విరక్తిని పారద్రోలి - జీవితం మీద అనురక్తిని పెంచుతాయి !

-సుతిమెత్తని ప్రేమసుమాలను విశ్వమంతా విరజిమ్ముతాయి !

1-8-1995